క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చరూ..



వడ్లమూరు జగనన్న కాలనీలో తొలగించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

సామర్లకోట: పెద్దాపురం మండలం వడ్లమూరు గ్రామంలో సుమారు ఏడు నెలల క్రితం తీసివేసిన ట్రాన్స్‌ఫార్మర్లను ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగనన్న లే అవుట్‌లో ఉన్న ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు మరో ప్రదేశంలో వేయడానికి తొలగించగా ఆ ప్రాంత ప్రజలు అడ్డుకున్నారు. దాంతో ట్రాన్స్‌కో సిబ్బంది వాటిని అక్కడే వదలి వెళ్లిపోయారు. ఇప్పటి వరకు వాటిని తొలగించిన ప్రదేశంలో ఏర్పాటు చేయలేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కంటే రాఘవరావు ఆరోపిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ట్రాన్సుఫార్మర్లు ఏర్పాటు చేసి జగనన్న కాలనీ వాసులకు వెలుగు నింపాలని కోరుతున్నారు.

పాత సామర్లకోటలో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో సేవలందించిన మహిళలు

సామర్లకోట: కార్తిక మాసంలో అన్నదానం చేయడం వల్ల మంచి జరుగుతుందనే ఆలోచనతో స్థానిక వ్యాపారస్తులైన బొండు వెంకట్రావు సోదరులు ఆదివారం అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక పాత సామర్లకోటలో కొలువై ఉన్న అతిపురాతన అలివేలు మంగా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. ఆలయ ఆవరణలో ఉన్న రావి ఉసిరి చెట్టుకు భక్తులు పూజలు చేసి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు వద్దిపర్తి నగేష్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. సుమారు మూడు వేల మందికి అన్నదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

నాగులపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం



నాగలపల్లి కంటి వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

కొత్తపల్లి: మండలంలోని నాగులపల్లిలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వడిశెట్టి గౌరీరాజేశ్వరి, వడిశెట్టి నారాయణరెడ్డి అధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కాకినాడకు చెందిన కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు సుమారు 300 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కంటికి సంబంధించి తీసుకోవలసిన జాగ్రతలను వివరించారు.

కొత్తపల్లి మండల అధికారులు

తహసీల్దార్	91542 47464
ఎంపీడీఓ	94401 13090
ఇంజినీర్	99890 78030
ఎలక్ట్రికల్ ఏఈ	94408 12642
హౌసింగ్ ఏఈ	70939 30455
ఈఓపీఆర్డీ	99489 27333
ఉపాధి హామీ పథకం ఏపీఓ	83744 46378
డ్వాక్రా ఏపీఎం	89788 81622
ఎస్సై	94409 00752
సీఐ పిఠాపురం	94407 96523
వ్యవసాయ శాఖ ఏఓ	83310 56594
కొత్తపల్లి పీహెచ్‌సీ డాక్టర్	99890 69546
నాగులపల్లి పీహెచ్‌సీ డాక్టర్	98497 28671
కొమరగిరి పీహెచ్‌సీ డాక్టర్	92466 90633
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	89858 28380
ఎంఈఓ	92467 34465
ఐసీడీఎస్ సీడీపీఓ	94408 14692
ఇరిగేషన్ జేఈ	83310 75078

సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపాలిటీ

మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447



జి. మేడపాడులో యంత్రాల ద్వారా వరి కోతలు



సామర్లకోటలో ధాన్యం ఎగరబోతలో రైతులు..



ఆరబెట్టిన ధాన్యం నాణ్యతను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ఏఈఓ

జోరుగా వరి కోతలు

- రైతులను విస్మరిస్తున్న కూటమి సర్కార్
- అందని రైతు భరోసా
- మొక్కుబడిగా పంట నష్టం
- గత ఏడాది కంటే తగ్గిన దిగుబడి



నవర గ్రామంలో వరి కోతల్లో నిమగ్నమైన అన్నదాతలు

సామర్లకోట: మండల పరిధిలో వరి కోతలు జోరుగా జరుగుతున్నాయి. రైతులకు పెద్ద పీట వేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించింది. రైతులకు పెట్టుబడి సాయం అందజేస్తామని చెప్పి మొండి చేయి చూపిందనే విమర్శలు ఉన్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసాగా రూ.13,500 అందేదని రైతులు చెప్తున్నారు. నియోజకవర్గ పరిధిలో 40 వేల ఎకరాలలో సార్వా సాగు చేశారు. ఆగస్టు నుంచి వరసగా కురిసిన వర్షాలకు వరి చేలు పాడై పాయినా రైతులకు న్యాయం జరగలేదు. పంట పూర్తిగా నష్టపోయిన రైతులకు మాత్రమే ఎకరానికి రూ.10 వేలు సాయం చేశారని, మిగిలిన వారిని పట్టించుకోలేదని మిగిలిన వారు వాపోతున్నారు. మండల పరిధిలో సుమారు రెండు వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. నియోజకవర్గ పరిధిలో 50 శాతం వరి కోతలు పూర్తిచేసుకున్నారు.

సార్వాలో 45 బస్తాల వరకు దిగుబడి...

గత ఏడాది సార్వాలో ఎకరానికి 45 బస్తాల వరకు దిగుబడి రాగ ప్రస్తుతం 35 బస్తాలు దిగుబడి రావడం కష్టమవుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలో 80 శాతం వరకు వెదజల్లు పద్ధతిలో వరి సాగు చేయడం వల్ల పంట పటిష్టంగా ఉన్నప్పటికీ మూడు నెలల పాటు కురిసిన వర్షాలు దిగుబడిని దెబ్బ తీశాయని, నాట్లు సైతం నష్టపోవడంతో ఎకరానికి రూ.20 వేల అదనపు పెట్టుబడి పెట్టాల్సి వచ్చిందని రైతులు అంటున్నారు.

కోత యంత్రాలకు డిమాండ్

దీపావళి తరువాత రైతులు అందరూ ఒకేసారి కోతలకు సిద్ధం కావడంతో వరి కోత యంత్రాలకు డిమాండ్ ఏర్పడింది. గత ఏడాది ఎకరానికి రూ.2,200 నుంచి రూ.2,300 ఉన్న వరికోత యంత్రం అద్దె ప్రస్తుతం రూ.మూడు వేలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారని రైతులు చెప్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు జాప్యం వల్ల అనేక మంది రైతులు వరి కోత యంత్రాలతో కోసిన పచ్చి ధాన్యాన్ని కళ్లాలలోనే 75 కేజీల బస్తా రూ.1300 నుంచి రూ.1400కు విక్రయిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రస్తుతం రూ.1750 నిర్ణయించడం, బయట మార్కెట్‌లో రూ.1700 ఉండటంతో రైతులు బయట విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారు. పశు సంపద ఉన్న రైతులు మనుషులతో వరి కోతలు చేసుకొని గడ్డిని భద్రపరచుకుంటున్నారు.

వర్షాలతో సతమతం



వరుసగా కురిసిన వర్షాల వల్ల గత ఏడాది కంటే ఎకరానికి 8 నుంచి 10 బస్తాల వరకు దిగుబడి తగ్గిపోయింది. రైతులకు రైతు భరోసా అందలేదు. పంట నష్టం మొక్కబడిగా ఇచ్చారు. గిట్టుబాటు ధర కల్పించడంలో రైతులకు అన్యాయం జరుగుతోంది. సాధారణ రకానికి గ్రేడ్ 'ఏ'కు కేవలం 30 మాత్రమే తేడా ఉంది. కనీసం రూ.100 వ్యత్యాసం ఉండాలి. వీకే రాయపురంలో కాజ్‌వే శిథిలం కావడంతో కాలిబాట వంతెన మీదుగా ఆటోల ద్వారా ధాన్యం రవాణా చేసుకోవడంతో బస్తాకు రూ.20 అదనంగా ఖర్చు అవుతుంది.

– రేలంగి రాంబాబు, రైతు, వీకే రాయపురం, సామర్లకోట మండలం

దిగుబడి తగ్గలేదు



ప్రస్తుత సార్వాలో దిగుబడి 30 నుంచి 35 బస్తాలు వచ్చింది. అయితే నీట మునిగిన చేలలో మాత్రమే ఎకరానికి 20 బస్తాల దిగుబడి వచ్చింది. మండల పరిధిలో 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. జీపీఎస్ ఏర్పాటు చేసిన 196 వాహనాల ద్వారా రైతులు మండలంలో ఉన్న 30 రైసు మిల్లులలో ఎక్కడికైనా ధాన్యం సరఫరా చేయవచ్చు.

– ఐ.సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి కొత్త లైను ఏర్పాటు చేస్తుండడం వల్ల సోమవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఏవీఎస్ డీఎస్ ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనుల వల్ల బ్రౌన్‌పేట, కోటపేట, కుమ్మరవీధి, పాత తహసీల్దార్ కార్యాలయం, పెద్ద బజార్, బలుసులపేట, సంత మార్కెట్, సామాజిక ఆరోగ్యకేంద్రం, పెన్షన్‌లైన్, ఇందిరా కాలనీ, నీలమ్మ చెరువు, ఇస్మాయిల్‌నగర్, సంగీతరావుపేట, మెహర్ కాంప్లెక్స్, హెడ్ పోస్టాఫీసు పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు తెలిపారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించాలని ఆయన కోరారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



వడ్లమూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఈఓ ఆంజనేయులు

పెద్దాపురం: మండలంలోని వడ్లమూరు గ్రామంలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని అడిషనల్ సీఈఓ ఎస్.ఆంజనేయులు ఆదివారం పరిశీలించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమంలో భాగంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కచ్చితమైన, తప్పులకు తావులేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటలక్ష్మి ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నర్సింగపురంలో 30 ఏళ్ల తరువాత కలసిన పూర్వ విద్యార్థులు

పిఠాపురం: ఎప్పుడో 30 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు అప్పటి మధుర జ్ఞాపకాలను చెప్పుకుంటూ మురిసిపోయారు. పిఠాపురం ఆంధ్రకేసరి ప్రకాశం మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన 1983 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 30 ఏళ్ల తరువాత పిఠాపురం మండలం నర్సింగపురం రావులవారి మామిడి తోటలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కొంతసేపు వారంతా విద్యార్థులుగా మారిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



అమ్మవారి సారె తీసుకువచ్చిన పేరంటాళ్లతో ఈఓ విజయలక్ష్మి

మరిడమ్మకు సారె సమర్పణ

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ అమ్మవారికి మహిళలు ఆదివారం సారె సమర్పించారు. సిద్ధి వినాయక, షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద నుంచి సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేసి సారె సమర్పించారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పిఠాపురం ఉద్యాన అధికారి శైలజ

పిఠాపురం: ప్రభుత్వ రాయితీలను ఆయిల్ పామ్ రైతులు సద్వినియోగం చేసుకుని, మంచి లాభాలు సాధించాలని పిఠాపురం ఉద్యాన శాఖ అధికారి కె.శైలజ సూచించారు. పిఠాపురం మండలం వెల్దుర్తిలో పెద్దాపురం పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్ పామ్ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న మొక్కలు, ఎరువులు, రాయితీలను వివరించారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పి వారి సందేహాలను నివృతి చేశారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అనేక రాయితీలు కల్పించిందన్నారు. ఉద్యాన శాఖ ద్వారా అందించే సూచనలు సలహాలు పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు విస్తరణ, అధిక దిగుబడులు, గెలలు కోత, నాణ్యత తదితర అంశాలను వివరించారు. ఫీల్డ్ ఆఫీసర్ డీఎల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెగుళ్లు, చీడ పురుగులు, నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కె.నరేష్, పతంజలి ఫుడ్స్ కంపెనీ సిబ్బంది వెంకటేశ్వరరావు, మురళి, భవాని, నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

గౌతమ్ అదానీని అరెస్టు చేయాలి



పెద్దాపురంలో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: సోలార్ విద్యుత్ పేరుతో అవినీతికి పాల్పడిన గౌతమ్ అదానీని తక్షణమే అరెస్టు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా చేశారు. ఆ పార్టీ మండల కార్యదర్శి డి.క్రాంతి కుమార్ మాట్లాడుతూ ప్రపంచ ఆర్థిక నేరస్తుడిగా అదానీ మారిపోయాడని, దీనిపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, కూనిరెడ్డి అరుణ, నెక్కల నరసింహమూర్తి, ఆర్.వీర్రాజు, చల్లా విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పారిశ్రామిక క్రీడలు



క్రికెట్ పోటీలో విజేతగా నిలచిన రాక్ సిరామిక్స్ జట్టు

సామర్లకోట: పెద్దాపురం ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఏరియా పరిధిలోని పరిశ్రమల మధ్య ఏర్పాటు చేసిన ఆటల పోటీలు ఆదివారంతో ముగిసాయి. ఈ నెల 18వ తేదీన పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆటల పోటీల్లో రాక్ సిరామిక్స్, దేవి సీఫుడ్స్, శ్రీగిరిజ పవర్ ప్లాంట్, నెక్కంటి సీఫుడ్స్, పంతంజలి ఫుడ్స్, పట్టాభి ఆగ్రో ఫుడ్స్, ఎలైట్ ఇన్‌స్ట్రుమెంట్స్, అపెక్స్ సంస్థల ఉద్యోగులు పాల్గొన్నారు. క్రికెట్ పోటీల్లో రాక్ సిరామిక్స్ విన్నర్స్‌గాను, అపెక్స్ రన్నర్స్‌గాను నిలిచాయి. షటిల్ డబుల్స్‌లో రాక్ సిరామిక్స్ ప్రథమ, నెక్కంటి సీఫుడ్స్ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. షటిల్ సింగిల్స్‌లో అపెక్స్ ప్రథమ, నెక్కంటి ద్వితీయ బహుమతులు గెలుచుకున్నాయి. చెస్‌లో పట్టాభి ఆగ్రో విన్నర్స్‌గాను, శ్రీ గిరిజ పవర్ ప్లాంట్ రన్నర్స్‌గా నిలిచాయి. విజేతలకు మహారాణి కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, కళాశాల కరస్పాండెంట్ రమేష్, ఆయా పరిశ్రమల ప్రతినిధులు బహుమతులు అందజేశారు. పరిశ్రమలలోని ఉద్యోగులను ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసిన ఆట పోటీలకు మైదానం ఇవ్వడానికి అంగీకరించిన ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ జాస్తి రమేష్‌లను పరిశ్రమల యజమానులు సత్కరించారు. కార్యక్రమంలో ఆయా పరిశ్రమల ప్రతినిధులు టి.సీ రజకుమార్, డాక్టర్ వీవీవీ శేషగిరి రావు, వినోద్, చెల్ల దురై పి.బాలాజీ, వీజీఎస్ కుమార్, రవీంద్రనాథ్, సత్యనారాయణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో పంచారామ క్షేత్రం కిటకిట



స్వామి వారికి తొలి అభిషేకం చేస్తున్న అర్చకులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జామున నాలుగు గంటలకు ఆలయం తెరచిన వెంటనే శివ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. గోపూజతో స్వామి వారికి అభిషేకాలు, తొలి పూజలను అర్చకులు ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన చేశారు. తెల్లవారు జామున, రాత్రి ఆలయానికి వచ్చిన భక్తులు కార్తిక దీపాలను వెలిగించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్న ప్రసాదాలను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు లక్ష పత్రి పూజలు జరిగాయి. సాయంత్రం స్వామి వారికి లక్ష బిల్వార్చన చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు, భక్త సంఘం సభ్యులు సేవలందించారు.

ఆకాశ దీపానికి పూజలు

స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర ఆలయంలో ఆదివారం రాత్రి ఆకాశదీపం పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేసి శిఖర భాగంలో అమర్చారు. అలాగే లక్షపత్రి పూజలు చేసుకున్న వారికి దీపారాధన సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన ఆదివారం ఎంతగానో ఆకట్టుకుంది. ఘనపాఠి శ్రీపాద రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో లక్షపత్రి పూజలు నిర్వహిస్తున్నారు.



ఆకాశ దీపానికి పూజలు చేస్తున్న అర్చకులు



లక్ష బిల్వాల నడుమ స్వామివారు

ఫ్లెక్సీ తొలగింపు



అధికార పార్టీ ఫ్లెక్సీని తొలగించిన అధికారులు

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం సమీపంలోని వైఎస్సార్ విగ్రహం పై భాగంలో ఏర్పాటు చేసిన అధికార పార్టీ ఫ్లెక్సీని ఆదివారం తొలగించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను పురస్కరించుకొని ప్రముఖ రాజకీయ నాయకులు, జాతీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి ముసుగు వేసి పై భాగంలో అధికార పార్టీకి చెందిన ఫ్లెక్స్ తొలగించలేదు. దాంతో సాక్షి దినపత్రికలో 'కొండెక్కిన కోడ్' అనే శీర్షికతో వార్త ప్రచురితం అయింది. మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు హుటాహుటిన సిబ్బంది ఆ ఫ్లెక్సీని తొలగించారు.

మార్కండేయేశ్వర ఆలయంలో లక్ష కుంకుమార్చన



ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

సామర్లకోట: స్థానిక సంగీతరావుపేటలోని ఉమా మార్కండేశ్వర ఆలయంలో ఆదివారం లక్ష కుంకుమార్చన చేశారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో పూజలు చేస్తున్నారు.

ఓటు నమోదును సద్వినియోగం చేసుకోవాలి



ప్రత్యేక ఓటు నమోదుపై బీఎల్‌ఓలను ఆరా తీస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని యువ ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ శ్రీరమణి అన్నారు. స్థానిక లూథరన్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ యువ ఓటర్లకు ఓటు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత బీఎల్‌ఓలపై ఉందన్నారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని 80, 81, 53, 54 పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు.